# కాళరాత్రి

**"మన సిద్ధిపేట** సద్దుల బతుకమ్మలు చూసి మా అమ్మమ్మ సంబరపడి పోయిందిరా !"

మేము నడుస్తున్న రోడ్డు పక్కనున్న మక్కచేను పచ్చదనాన్ని ప్రకృతి వెచ్చదనాన్ని ఆస్వాదిస్తూ ఖుషీగా చెప్పిండు శంకర్.

మా మిత్రబృందముతో పాటు నేను గూడా మనోనేత్రాలతో ప్రకృతి పరవశింపుల నేరుకుంటున్నా.

"మీ అమ్మమ్మంటే... ఖమ్మం నుంచి వచ్చిందా ?" శేషగిరి శేషప్రశ్న మా అందరి దృష్టినటు తిప్పింది.

"అవున్రా... వాళ్లది ఖమ్మమే. అక్కడ బతుకమ్మ పండుగ ఇక్కడంత జోరుగ జరగదు గదా ! రంగు రంగుల పూలబతుకమ్మల చుట్టూ ఆడోళ్లంతా కలిసి ఆడుకోవడం, చెరువుకు వొయ్యి ఉయ్యాల పాటల్తోని బతుకమ్మను సాగనంపడం, గట్టు మీద కూచోని ఫలహారాలు పంచుకుని తినడం... ఓ పిక్నిక్ లెక్క అన్పించిందని ఒక్క తరీకనే మురిసి పోయింది" శంకర్ ఉత్సాహం రెట్టిప్పైంది.

దసరా పండుగనాడు దోస్తులతో కలిసి జంబికివోతున్నం. మార్గమధ్యమున మొన్నటి బతుకమ్మ పండుగ విశేషాలు నెమరేసుకుంటున్నం. మా ఒంటిమీద సవారి చేస్తున్న కొత్త డ్రెస్సుల గురించి అంతకు ముందే చర్చించుకున్నం.

రోడ్డుకు రెండు పక్కల పచ్చని పొలాలు, చేన్లు, ఎత్తైన చెట్లు మా ముచ్చట్లు వినుకుంట హాయిగా తలలాడిస్తున్నై.

స్వర్గలోకంల అప్సరసల లెక్క వయ్యారంగ నడుములూపుతున్న వరిమొక్కల చెక్కిళ్లను ముద్దాడి వచ్చిన గాలి తరగలు మా శరీరాలను చల్లగా తాకుతున్నై. వాతావరణం ఆహ్లాదకరంగా ఉంది మనసుకు ఉల్లాసంగా ఉంది.

ప్రేమ ఎక్కువైతే పేరు పొట్టిగైపోతుంది గదా ! ఆత్మీయ మిత్రుడు శంకర్‌లాల్ పేరు మా నాలుకలమీద నాని శంకర్ అయిపోయింది.

శంకర్, నేనూ ప్రపంచమంటే ఏమిటో, తెలియని పసిప్రాయం నుండి స్నేహితులం. చెడ్డీల మీదున్నప్పుడు ఒకే కంచములో తిని ఒకేమంచములో పడుకుని, ఒకేలైటు కింద చదువుకున్నం. డాబాపై పడుకున్నప్పుడు ఆకాశం మైదానముల ఆరవోసిన చుక్కల్ని ఎన్నిసార్లు లెక్కవెట్టినమో ! ఫస్ట్‌క్లాసు నుండి పదోతరగతి దాకా ఒకే బెంచిమీద కూచుండి ఒకే మైదానంల క్రికెట్ ఆడుకున్నం.

వాళ్లమ్మా నాన్నలు ఉద్యోగరీత్యా మా ఊరొచ్చి స్థిరపడిపోయినప్పటికి మేమింకా పుట్టనే లేదట. ఇంటర్ రెండు సార్లు డింకీలు కొట్టిన శంకర్ ఇహ చదువుతో కుస్తీలు పడితే లాభం లేదని "శంకర్ డ్రెస్సెస్" షాపు ప్రారంభించి వ్యాపారస్తుడయిండు.

నేనేమో బియ్యే పాసయినంక ఏవేవో ఎంట్రెన్సులు రాసిరాసి, ఇంటర్వ్యూలల్ల తలబద్దలు కొట్టుకుని – అందని ద్రాక్షపళ్ల కాశడితే వయసు వాడిపోతుందని వ్యాపారముల అడుగు వెట్టిన.

మాటలు, ముచ్చట్లతోని ఊరు పొలిమేర దాటి నర్సాపూర్ గ్రామంల పాదార్పణం చెయ్యంగనే సీమోల్లంఘనమైపోయింది.

అప్పుడే చప్పట్లు వినబడినై.

"అగ్గో పాల పిట్ట !" జనాలందరితోపాటు చప్పట్లు చరుస్తూ ఎగిరి గంతేసిండో మిత్రుడు. అంతా పైకి చూసినం.

అవును... పాలపిట్టనే... రంగుల రెక్కలు విప్పి ఎగురుతూ పోయి ఓ చెట్టుమీద కూచుంది. ఇంకేముంది ! పాలపిట్ట దర్శనమైంది. దండం బెట్టి జంబి ఆకు వగైరాలు కొనుక్కొని క్యూలో నిల్చున్నం. నర్సాపూర్ హన్మాన్ మందిరం ముందు హన్మంతుని తోకలా విస్తరించిన క్యూలో రకరకాల మనుషులు కిటకిటలాడ్తున్నారు. సహనం ఊపిరిగా ఓపిక పెట్టుబడిగా భావించి క్యూలో వెళ్లి హన్మంతుని దర్శించుకుని బయట పడినం. ప్రపంచ రాజకీయాలు, కాశ్మీర్ సమస్య, వాజపేయి, ముషార్రఫ్‌ల ముషాయిరా... మా నాలుకలమీదాడినై. అందరి ఇళ్లల్లకు అందరం వెళ్లి పెద్దల ఆశీస్సులందుకున్నం. చిట్టచివరగా శంకర్ ఇంటికి ఖుషీగా వెళ్లినం. వాళ్లమ్మా నాన్నలు మనసారా ఆశీర్వదించిండ్రు.

"మీ అమ్మమ్మ ఆశీస్సులు గూడా తీసుకుంటే హంగామ గుంటదిరా !" శంకర్‌కు గుర్తు జేసిన. నా దృష్టిలో వృద్ధమాత ఆశీస్సులు అతి పవిత్రమైనవి.

"అవును... నిజమే" అన్నారంతా.

"మా అమ్మ గదిల ఉంది. తీస్కరారా శంకర్ !" శంకర్ తల్లి సంతోషంగా ఆజ్ఞాపించింది.

శంకర్ ఠక్కున లోపలికెళ్లిండు. వాళ్ల అమ్మమ్మను చేతులు పట్టి తీసుకొచ్చి కుర్చీలో కూచోబెట్టిండు. సుమారు డెబ్బై వసంతాలు కళ్లజూడొచ్చు. మాగి ముడతలుబారిన మామిడిపండోలె... గుండ్రని మొహమ్మీద గీతలు చోటుచేసుకున్నై.

ఇంత వయసొచ్చేదాకా నేను బతికుంటానా ! నా సందేహానికి నాలో నేనే నవ్వుకున్నాను.

అంతాకలిసి ఆ సీనియర్ సిటిజన్‌కు నమస్కరించినం.

"సుఖీభవ !" గుండెలనిండా ఆశీర్వదించి "కూచోండ్రి బిడ్డా !" అంటూ మమ్ముల్నోసారి పరీక్షించి చూసింది. అరచెయ్యిని రెండుకళ్లపైనుంచుకుని తీక్షణంగా చూసింది.

"మా అమ్మమ్మ విచారంగ ఉన్నదియ్యాల్ల. లేకపోతే ముచ్చట్లతోని మన కడుపు లుబ్బేటట్టు నవ్వించేదిరా !" అన్నడు శంకర్.

నిజమే... వృద్ధనారి నుదుటి మీద అనుభవరేఖలు వంకర్లు తిరుగుతున్నై.

"కొండంత పండుగనాడు గంత విచారమెందుకమ్మమ్మా ?" ఆమెను సూటిగా చూస్తూ అడిగిన.

"దసరా రోజులంటే ... నా గుండెలల్ల నల్లసరపు గుండ్లు దొర్లుతై బాబూ ! నన్ను దగాజేసిన రోజులు గదా !" ముసలి చూపులు నన్ను ప్రత్యేకంగా తడిమినై. ఆమెను నేనింతకు ముందోసారి చూసినానని గుర్తుబట్టినట్టు తలూపింది. "ఇంతకు ముందు నేనీ ఊరు వచ్చినప్పుడు మీరు చిన్న పిల్లలు గదా !"

"అవునమ్మా !" శంకర్ తల్లి అందుకుంది. "మా అమ్మ కాశ్మీర్ల ఉన్నప్పుడు జరిగిన సంగతుల్ని మరిచిపోలేదు".

"ఎట్లా మరిచిపోవాలె ? అవి జీవితాన్నే ఓ మలుపు తిప్పినై గద బిడ్డా !" సుదీర్ఘమైన నిట్టూర్పు వెలువడింది.

"ఆ సంగతులేమిటో వినాలనుంది. చెప్పు అమ్మమ్మా !" శంకర్ గొంతులో గారాబం సుడులు తిరిగింది.

"ముందు చాయలు దాగుండ్రి. అటెన్క విన్రండి". అందరికీ చాయలందిస్తూ శంకర్ వాళ్లమ్మ "మా అమ్మగ్గూడా చెప్పాలనే ఉంటుంది. జెర నిదానంగ వినుండ్రి మా అమ్మకథ" నవ్వుతూ వాళ్లమ్మ పక్కన కూచుంది. మాతోపాటు తానూ వినాలని తయారైంది.

"మీకంతా చెప్తే నా మనసు తేలికైపోతుంది" అంటూ తానూ ఓ చాయ అందుకుంది వృద్ధనారి.

"అమ్మమ్మ చాలా ఆక్టివ్‌రా !" నా చెవుల గొణిగిండో మిత్రుడు. అవునన్నట్టు వాని మొహం చూస్తూ నేనూ నవ్వేసిన.

మాలోని ఆసక్తి ఉప్పెన లెక్క పొంగుకొస్తూంది. కుతూహలాన్ని అదుపులో పెట్టుకుంటూ సోఫా లాక్రమించినం. కళ్లు, చెవులు వృద్ధమాత కప్పగించి చాయలు సేవించినం.

"భారత దేశానికి స్వాతంత్ర్యం రాంగనే కాశ్మీర్ల విషనాగులు బుసలు కొట్టినై." సీనియర్ సిటిజన్ ముఖారవిందము సీరియస్‌గా మారింది. నుదిటి రేఖలు నిల్చుండి పోయినై. "మన దేశములున్న రాజ సంస్థానాలన్నీ భారతయూనియన్ల విలీనమై పోయినై కాని మూడు మిగిలి పోయినై. అందులో కాశ్మీర్ ప్రధానమైంది. ఆ రోజులల్ల... కాశ్మీర్ రాజ్యములోని ముజఫరాబాదుల నా భర్త జిల్లా ఆఫీసరు. అప్పటిదాకా రోజులు ప్రశాంతంగనే గడిచినై.

కైలాస పర్వతాలను మరిపించే మంచుకొండల నడుమ కాశ్మీరం ... మన దేశమాత నుదట కుంకుమ బొట్టు అన్నారు. జలజల పారుతూ గుండెలను మురిపించే సెలయేర్లు, రంగురంగుల పూలతోటలు, పచ్చదనం పల్లవించిన ఆపిల్‌పండ్ల తోటలు, పట్టణం నడుమ సరస్సులు, వాటి మీద బోటు షికార్లు... అదొక భూలోక స్వర్గమే. అంత ప్రశాంతంగ ఉన్న

వాతావరణం... కాశ్మీర్ విలీనం సమస్యతోని భగ్గుమన్నది...." ఆగిపోయింది.

"అదేంది అమ్మమ్మా ! మీరు కాశ్మీర్ల ఉండేవారా ? తాతయ్య ఉద్యోగం చేసేవాడా ?" శంకర్ నోరు బార్లా తెరుచుకుంది.

"అవున్రా... ! ముజఫరాబాదు అప్పుడు కాశ్మీర్ సంస్థానములుండేది. ఇప్పుడు ఆక్రమిత కాశ్మీర్ల ఉన్నది. మీ తాతయ్యకు సమర్థుడైన ఆఫీసరనే పేరుండేది. అక్కడి జనాల కెంతో సాయం చేసేవాడు. మీ అమ్మ, మావయ్యలప్పుడు చానా చిన్నపిల్లలు. మంచుకొండల్ని చూసుకుంట, ఆపిల్‌పండ్లను తినుకుంట, కేరింతలు కొడుతుంటే మా మనసు పూలరెమ్మల లెక్క ఊగుతుండేది. కాని... అదే 1947 అక్టోబర్... మా బతుకుల్నే మలుపు తిప్పింది..." ఏం గుర్తుకొచ్చిందో మల్లా ఆగిపోయింది.

"అదెట్లా ... ఏమైందనీ ?" నేనూరుకోలేక పోయిన. మాకైతే సస్పెన్స్, థ్రిల్లింగ్, సెంటిమెంటల్ సినిమా చూస్తున్నట్టుంది.

"చెప్తున్నరా బడవా !" మంచుముద్ద మీది సూర్యకిరణం లెక్క ఓ సన్నని నవ్వు ఆమె పండు పెదాల మీద గంతులేసి మాయమైంది. "కాశ్మీర్ రాజ్యంల ముస్లిం జనాభా ఎక్కువ. అయినా హిందూ ముస్లిములు పాలు – చక్కెర లెక్క కలుసుండేవాళ్లు. విలీనం సమస్యముందుకు రాంగనే రాజా హరిసింగ్ తన కాశ్మీర్ సంస్థానాన్ని భారత యూనియన్ల కలిపేస్తే ఏ సమస్యా ఉండేది కాదు... కాని దాన్నే స్వతంత్ర దేశంగా ప్రకటించి తానే ఏలుతానని పగటి కలలు కన్నడు. దురాశ దుఃఖానికి చేటన్న సంగతి మరిచి పనికిరాని ప్లాన్‌వేసి దెబ్బదిన్నడు. చాలా తాత్సారం చేసిండు. దాన్నే అదనుగా తీసుకుని పాకిస్తాన్ కాశ్మీర్‌ను తమ దేశముల కలుపుకోవాలని అన్ని రకాల ప్రయత్నించింది. ఆ ప్రయత్నాలల్ల భాగంగా మత భూతాన్నాశ్రయించింద్రు పాకిస్తాన్ పాలకులు. పాకిస్తాన్ నుండి గూఢచారులను, గూండాలను, రౌడీలను కాశ్మీర్‌కు పంపి దౌర్జన్యాలు చేయించింద్రు. ముస్లిమేతరుల నందరినీ కాశ్మీర్‌నుండి పంపివేయాలి ? లేదా చంపి వేయాలని ప్లాను వేసి పకడ్బందీగా అమలు చేసింద్రు. కొద్ది రోజుల్లోనే అందాల కాశ్మీర్లో ఆకుపచ్చని మంటలు లేచినై. దాన్నే ముస్లిం రాజ్యంగా మార్చి తమదేశంల కలుపుకోవాలన్న పాకిస్తాన్ పట్టుదల వెర్రితలలు వేయించింది. జిహాద్ మత్తును కాశ్మీర్ ముస్లింల నరాల కెక్కించింద్రు. మసీదులల్ల రహస్యసమావేశాలు పెట్టి రెచ్చగొట్టింద్రు. అల్లా పేరుమీద అకృత్యాలు చేయించింద్రు. పరిస్థితి వేగంగా మారిపోయింది. అప్పటి భారత గవర్నర్ జనరల్ మౌంట్‌బాటన్ డబల్ గేమ్ ఆడిండు. హిందువుల ఇండ్లమీద రాత్రింబవళ్లు దాడులు జరిగినై. గృహదహనాలు, మానభంగాలు, హత్యలు నిత్యకృత్యాలైపోయినై. హిందూ కుటుంబాలెన్నో ధన మానాలను వదులుకుని పారి పోయినై. మార్గమధ్యముల దొరికిన వారి ప్రాణాలు పోయినై. తండ్రుల ముందు బిడ్డల్ని, భర్తల ముందు భార్యల్ని క్రూరాతి క్రూరంగా మానభంగాలు చేసి అందర్ని చంపేసింద్రు.

పాకిస్తాన్ కాశ్మీర్ మీద యుద్ధం షురూ జెయ్యంగనే కాశ్మీర్‌ను భారత్‌ల విలీనం

చెయ్యాలనుకున్న రాజాహరిసింగ్ డోగ్రా రాజమర్యాదలను, సాంప్రదాయాలను మంటగలిపి కుటుంబముతో సహా జమ్మూకు పలాయనం చిత్తగించిండు. కాశ్మీర్ సింహమనుకున్న షేక్ అబ్దుల్లా పిల్లిగా మారి ఢిల్లీకి పారిపోయిండు. ప్రజల ధన, మాన, ప్రాణాలను పాకిస్తాన్ రాక్షసుల కప్పజెప్పి వాళ్లు సుఖంగా ఉన్నరు.

మా వీధిలో గూడా అల్లర్లు, దాడులు మామూలైపోయినై. అంతవరదాకా మాతో దోస్తీ జేసి ఆత్మీయంగా మెదిలిన మా ఇంటి పక్కల ముస్లిముల ప్రవర్తన కొత్తగ కన్పించింది. కడుపుల్ల కత్తులు, పెదాల మీద నవ్వులు కన్పించినై. మాతోని మంచిగ మాట్లాడ్తానే ఆగర్భశత్రువుల లెక్క మెదుల్తున్నరు.

దసరా పండుగ రోజు ... దుర్గాపూజలెక్కడా కన్పించలేదు. కాని దర్గాలనుండి రాక్షస మూకలు దర్జాగా బయటి కొచ్చినై. రావణాసురుడు లాంటి రాక్షస సంహారం జరిగిన ఆ రోజున నరరూపరాక్షసులు పేట్రేగి నరమేధానికి దిగిండ్రు. ఊరంతా తుపాకి మోతలు, ఆర్తనాదాలు ఆకాశాన్నంటుతున్నై. మా కాళ్లు వొయ్యి కడుపుల జొచ్చినై. గుండెలల్ల రైల్లు ఉరుకుతున్నై.

"మనం గూడా వెళ్లిపోదామా !" ఊపిరి బిగపట్టుకుని అడిగిన మీ తాతను. ఆయన మొహం విచిత్రంగా మారింది.

"మన మిక్కడ ఎన్నో సంవత్సరాల నుంచి ఉంటున్నం. మన యౌవనమంతా ఈ కాశ్మీర్‌కు అంకితమైంది. దీంతోని మనకు విడదీయరాని అనుబంధముంది..." లోపలి భయం బయట పడకుండా చెప్పబోయిండాయన. "మనమే పిరికోళ్ల లెక్క పారిపోతే అపురూపమైన ఈ కాశ్మీరమేమై పోతుంది ?"

"కొంచెం అటు చూడుండ్రి. మనపిల్లల మొహాలు చూడుండ్రి" నేను సముదాయింపుకు దిగిన "పెళ్లీడు కొచ్చిన మీ చెల్లెను చూడుండ్రి. ఇక్కడ మన భవిష్యత్తు క్షేమంగా ఉంటుందా? మీ చెల్లెకు పెండ్లి చెయ్యగలమా ?" నిలదీసిన. "పాకిస్తాన్ రెయిడర్ల వీరంగం చూస్తలేరా ? బతికుంటే బలుసాకు తిని సాధించవచ్చు" పట్టుబట్టిన.

పాపం ! మా మరదలు ప్రాణాలు అరచేతిల పట్టుకుని "వెళ్లిపోదామన్నయ్యా ! నాకు భయమైతుంది. మా క్లాసుమేట్ సుశీలను ధారుణంగా చెరిచి చంపేసిండ్రు. వాళ్లింట్ల అందర్నీ చంపేసిండ్రు. మన గతి ఏమైతదో..." నని బావురుమన్నది.

ఆ రోజుల్లోనే పాకిస్తాన్ రెయిడర్లు ముజఫరాబాదు జిల్లా కలెక్టర్ మీద దాడిజేసి చంపేసిండ్రు. అతడు ఎంత ప్రతిఘటించినా ... కాళ్లు చేతులు ముక్కలుముక్కలుగా నరికి పారేసిండ్రు. అతని భార్య శ్రీమతి కృష్ణ మెహతాను కృష్ణ గంగ ఒడ్డుకు తీసుకపోయిండ్రు. అక్కడ ధారుణ మానభంగాలకు గురైన హిందూ స్త్రీలు తమపిల్లల్ని గంగలకు విసిరేసి వాళ్లూ దుంకుతున్నరట. నరరూప రాక్షసులు ఆమెమీద అత్యాచారం చెయ్యబోయిండ్రట. ఆమె తన చాకచక్యాన్నంతా ప్రదర్శించి ఆస్తిపాస్తుల్ని వదులుకుని, కొడుకుని తీసుకుని తప్పించుకుందని

తెలిసింది. అంతటి వాళ్లకే దిక్కులేదంటే... సామాన్యుల సంగతేంజెప్పాలి ?

బాధనంతా మనసు పొరల్లో దాచుకున్న మీ తాతయ్య మొహం ముడుచుపోయింది.

"ఇక్కడి నుండి ఎక్కడికి పోదాం ?" గంభీరంగ అడిగిండు.

"మ పూర్వీకులున్న ఖమ్మం పోదాం." అని సామానులు సర్దడం ప్రారంభించిన

"అక్కడ అడుక్కుతిన్నాసరే, నాలుగిండ్లల్ల పాచిపని చేసినాసరే... నిర్భయంగా, గౌరవంగా బతకొచ్చు." మా మరదలు తెగేసి చెప్పింది. తానూ బట్టలు సర్దడంలో లీనమైంది.

"రాత్రి పదిగంటలకు ఢిల్లీకి ట్రెయినుంది. నేను టికట్లు తీసుకొస్తా. రిజర్వేషన్‌కు ప్రయత్నిస్తా. మీరు సామానులన్నీ సర్దెయ్యండి" అని అటెండర్ను వెంటబెట్టుకుని బయలుదేరిండు. కాని... శవమై తిరగొచ్చిండు బాబూ !" వృద్ధమాత తెల్లని కనురెప్పల నుండి అశ్రుబిందువులు టపాటపా రాలిపడుతున్నై.

మా గుండెల్ని మెలిపెట్టి నట్లైంది.

"ఈ విషయం మాకు పదేళ్ల క్రితమే చెప్పినవు గదమ్మా !" శంకర్ అమ్మ కళ్లు మంచుపూవులై పోయినై. తల్లి కళ్లను తన కొనకొంగుతో అద్దింది.

ఓ నిమిషం మౌనం రాజ్యమేలింది. ఆ తర్వాత వృద్ధమాత పండుమొహం మళ్లీ గాంభీర్యాన్ని పులుముకుంది.

"కాశ్మీర్ల హిందువులు మైనార్టీలు. వాళ్లు కనబడితే ముస్లిములకు పగ, ద్వేషం... పరిస్థితి మరింత తీవ్రమైందని అప్పుడర్థమైంది."

"మరి తాతయ్యను చంపిందెవరమ్మమ్మా ?" నా ఆసక్తి అడిగింది.

"ఎవరోకాదు. ఆయన వెంటవెళ్లిన మా అటెండరే. ముస్లిమైనా అతని మీద మాకెప్పుడూ అనుమానం రాలేదు. ఆ వారం రోజుల్లోనే క్రూరుడైపోయిండు. శవాన్ని మోసుకొచ్చి, నాముందు పడేసి భయంకరంగ నవ్విండు. ఎల్లవేళలా మమ్ముల్ని రక్షిస్తాడనుకున్న వాడే భక్షించిండు. కెవ్వున కేకవెట్టి నేను శవమ్మీద పడిపోయిన. తిరిగి తెలివికొచ్చేసిరికి నా మరదలు వరండాల నగ్నంగా కనిపించింది. చుట్టూ నలుగురైదుగురు రైడర్లు... వాళ్ల చేతులల్ల తుపాకులు కత్తులున్నై. పులుల నడుమ మేకపిల్ల లెక్క నా మరదలు దీనంగా అరుస్తూ మానసంరక్షణ కోసం అటూ ఇటూ ఉరుకుతూంది. ఆ రాక్షసులల్ల మా అటెండరున్నడు గాని ఆ అమాయకురాల్ని పట్టించుకునే వాడే లేడు. విచిత్రంగ నవ్వుతూ ఒకని తర్వాత ఒకడు అందరిముందు అక్కడికక్కడే పైశాచికంగా మానభంగం చేసిండ్రు. ఆ తర్వాత ఓ కత్తి ఆమె చెంపల్ని, స్తనాలను కోసేసింది. రక్తం జివ్వుమని చిమ్ముతూంటే, ఆమె హాహాకారాలు పెడుతూంటే వాళ్లంతా పిశాచాల లెక్క నవ్వుకుంట చుట్టూ తిరుగుతున్నరు. కేరింతలు కొడుతున్నరు. మా అటెండర్ కత్తి ఆమె మర్మాంగముల దూరింది. ఒకడు చేతులు నరికేస్తుంటే, ఇంకొకడు కాళ్లు నరికిపారేసిండు. రక్తం కాలువలు కట్టింది ...

నా పొత్తికడుపుల నుంచి పొంగుకొస్తున్న ఉప్పెనను గొంతుల అదిమిపెట్టిన. దుఃఖ సముద్రాన్ని మోస్తున్నా... అయినా ఏదోశక్తి 'భారత్‌కే యహనారీహై, నారీ నహీ చింగారీహై' నినాదాన్ని గుర్తుచేసింది. మీ తాతయ్య జేబులున్న రైలుటికట్లు, బీరువాలున్న డబ్బు, నగలు హాండ్‌బ్యాగులేసుకున్నా. నిద్రవోతున్న ఇద్దరు పిల్లల్ని భుజాలమీదేసుకుని పెరటి దర్వాజ నుండి బయటికొచ్చిన. సందులు గొందులు తిరుగుకుంట బజారు కొచ్చిన. ఓ దుకాండ్ల బురఖా కొనుక్కున్న. వెంటనే వేసుకున్న. ప్రాణసమానమైన భర్తనూ, నా చేతుల్లో గారాబంగా పెరిగిన నా ముద్దుల మరదలును కాశ్మీర్ కాళరాత్రి కప్పజెప్పి గుండెరాయి జేసుకుని రైలుబండెక్కిన. ఏ క్షణంల ఏమవుతుందో, ఏ నిమిషాన నా గుండె బద్దలవుతుందో... భయంతో రాత్రంతా ప్రయాణం. ఉదయం ఢిల్లీలో దిగిన. ఆ తర్వాత ధైర్యంగా ఖమ్మం చేరుకున్న. పుట్టెడు దుఃఖాన్ని మోసుకెళ్లిన నన్నూ నా పిల్లల్ని మా తాతయ్య అక్కున చేర్చుకున్నడు. అత్తయ్య, మావయ్యలు నా దీనగాథ విని వెక్కివెక్కి ఏడ్చిండ్రు. వాళ్ల ఆదరణతోనే అక్కడనే నిలదొక్కుకున్న..."

పాపం ! ఊరిపి బిగపట్టి వెక్కివెక్కి ఏడుస్తున్న వృద్ధమాతనెట్లా ఊరడించాలో మా కర్థం కాలేదు.

"అమ్మా... ఊరుకోవే !" అంటూ శంకర్ తల్లి ఆమెను గుండెలకు హత్తుకుంది.

"అయ్యో కాశ్మీరమా ! భూతల స్వర్గమనుకున్న నువ్వు భూతాల స్వర్గమై పోయినవా!" నా గుండెమంటలు అందరికీ వినబడినై.

"అవును బిడ్డా !" వృద్ధమాత నిదానించింది. "దసరా రోజులొచ్చినయంటే... నా లోపల సప్తసముద్రాలు పొంగుతై. ఆనాటి కాళరాత్రి నన్ను వేధిస్తూనే ఉంటుంది...."

"మరైతే... మీ అమ్మానాన్నలు..." చేతిగుడ్డతో కళ్లద్దుకుని అడగబోయిండో మిత్రుడు.

"చాలా సంవత్సరాలక్రితమే మానాన్నకు కాశ్మీరు సంస్థానముల ఉద్యోగం దొరికిందంటా. అందుకే నైజాం రాజ్యాన్నొదిలి కాశ్మీర్ రాజ్యాని కెళ్లిండటా..." ఆమె మామూలు స్థితికొచ్చింది. "మా అమ్మ తెలుగమ్మాయే. మా ఇంట్ల తెలుగే మాట్లాడుకునే వాళ్లం. నైజాం గూడా భారత్‌ల విలీనం కాలేదప్పటికి. రజాకార్ల లొల్లి, మారణకాండ నడుస్తనే వున్నది. కాని... తర్వాత విలీనమై పోయింది గదా ! బిడ్డలారా ! కాశ్మీర్ సమస్య రావణకాష్టం లెక్క ఇంకా మండుతనే వున్నది. దానికి పరిష్కారమెప్పుడో ఏమో !"

వృద్ధమాత మాటలు వింటూంటే బరువెక్కిన మా గుండెనరాలు కొత్తస్వరాలు వినిపిస్తున్నై. ఆ ప్రశ్నకు జవాబు దేవులాడుతున్నై.

**"మైత్రేయ కళా సమితి" సంగారెడ్డి వారు నిర్వహించిన**
**తెలంగాణ కథల పోటీల్లో ప్రథమ బహుమతి పొందిన కథ.**